సమస్యల గురుకులం

నాదర్‌గుల్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో పడకేసిన పారిశుధ్యం

కంపు కొడుతున్న మురుగు.. హాస్టల్ అంతా దుర్గంధం

కిటికీలు, తలుపుల లేమితో వణికిపోతున్న విద్యార్థులు

రోగాల బారిన విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు

పేరుకే గురుకులం.. విద్యార్థుల బతుకు ఆగం

ఉడికీ ఉడకని భోజనం.. తరచూ విద్యార్థులకు అవస్థలు

చదువుపై దృష్టిపెట్టలేని స్థితి.. గోడలపై బోర్డులకే మెనూ పరిమితం

పట్టించుకోని ప్రభుత్వం.. ఇష్టారాజ్యంగా సిబ్బంది

నాదర్‌గుల్‌లోని కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో కిటికీలు లేక దుప్పట్లు, బస్తాలు కట్టుకున్న దృశ్యం

హాస్టల్‌లో తలుపులు, కిటికీలకు బస్తాలు, దుప్పట్లు కట్టుకున్న దృశ్యం

మహేశ్వరం, సెప్టెంబర్ 3: నాదర్‌గుల్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ హాస్టల్ సమస్యల వలయంలో చిక్కుకున్నది. కనీస మౌలిక వసతులు కరువయ్యాయి.. గాలొస్తే గల గల.. వానొస్తే వలవల అన్న చందంగా మారింది. వర్షం వస్తే చాలు హాస్టల్ మొత్తం వర్షం నీటితో నిండిపోతుంది. దీంతో రాత్రంతా జాగారం చేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. హాస్టల్ భవనానికి కిటికీలు, తలుపులు అంతంత మాత్రమే.. దీంతో విద్యార్థుల వద్ద ఉన్న దుప్పట్లు కిటికీలు, తలుపులకు కట్టి, రాత్రుల్లో చలికి వణుకుతూ నేలపైనే నిద్రపోతున్నారు. ఓ పక్క వర్షం, మరో పక్క దుర్గంధ వాసనతో హాస్టల్ మొత్తం కంపు కొడుతున్నది. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఆరుబయటే మల, మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. కొన్ని మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడంతో రాత్రుల్లు బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు.

చెత్తాచెదారంతో నిండిపోయిన పరిసరాలు

550మంది విద్యార్థులు ఉన్న జూనియర్ కళాశాల కూడా ఇదే భవనంలో ఉంది. భవనంలో ఎలాంటి సైకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ ముందు ధర్నా చేసినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అయినా ఫలితం దక్కలేదు. నిరవధికంగా కురుస్తున్న వర్షాలతో చాలామంది విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడ్డారు. జ్వరం వస్తే పట్టించుకునే నాథుడే లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు.

విద్యార్థులకు సీజనల్ వ్యాధులు

పారిశుధ్యం లోపించడంతో కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. కిటికీలు లేకపోవడంతో విద్యార్థులకు దోమలు కుట్టి వ్యాధుల బారిన పడుతున్నారు. విద్యార్థులకు జ్వరం వచ్చినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. చివరకు తల్లిదండ్రులు వచ్చి పిల్లలను తీసుకెళ్లి వైద్యం చేయించి పంపిస్తున్నారు. కొంత మంది టీసీలు తీసుకొని పోతున్నారు.

నాసిరకమైన భోజనం..

కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో నాసిరకమైన భోజనం పెడతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఉడికీ ఉడకని భోజనం తిని విద్యార్థులు అవస్థలు పడుతున్నారని మండిపడుతున్నారు. అరకొర సౌకర్యాలతో పాటు భోజనం కూడా సక్రమంగా పెట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ఏడాదికి రూ.1.20లక్షలు ఖర్చు పెడుతున్నామని చెబుతున్నా.. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

కందుకూరులో ఉండాల్సిన సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను నాదర్‌గుల్‌లో ఓ ప్రైవేట్ భవనంలో ఉంచారు. అక్కడ వసతులు సరిగాలేక చౌటుప్పల్ దగ్గరలో ఉన్న తుఫ్రాన్‌కు మార్చారు. అక్కడ కూడా అదే సమస్యలు రావడంతో తిరిగి నాదర్‌గుల్‌కు మార్చారు. అయినా నాదర్‌గుల్‌లో అదే సమస్యలు పునరావృత్తం అవుతున్నాయి. నెలకు పదిలక్షల పైచికులు అద్దె ఇస్తున్నా సమస్యలు మాత్రం ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు అయింది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. సౌకర్యలు లేకనే హాస్టల్ విడిసి విద్యార్థులు వెళ్లిపోతున్నారు.

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో సౌకర్యాలు లేక టీసీ తీసుకొని వెళ్లిపోతున్న విద్యార్థి

హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హాస్టల్ భవనం మార్చాలి..

నాదర్‌గుల్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను ప్రస్తుతం ఉన్న భవనం నుంచి మార్చాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే హాస్టల్ ముందు ధర్నా చేశారు. విద్యార్థులకు తాగడానికి కనీసం మంచి నీళ్లు లేవని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన చెందారు. పారిశుధ్యం పనులు సక్రమంగా చేయకపోవడంతో దుర్గంధ వాసనతో విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ప్రిన్సిపాల్‌తో పలుమార్లు సమావేశం అయారు. హాస్టల్ మార్చాలని ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన్నట్లు వారు తెలిపారు. ఇదే భవనంలో ఉంటే తమ పిల్లలకు ప్రమాదం ఉందన్నారు. గదులు శిథిలావస్థలో ఉన్నాయని.. కనీసం కిటికీలు లేకపోతే ఎలా ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జ్యోకం చేసుకొని తమ పిల్లలకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

– పెరెన్స్ కమిటీ సభ్యుల డిమాండ్

యజమాని స్పందిస్తలేడు..

హాస్టల్‌కు పది లక్షలు అద్దె చెల్లిస్తున్నాం. బిల్డింగ్ యజమాని కనీసం కిటికీలు అమర్చడం లేదు. ఔట్‌లెట్ లేక డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. మరుగు దొడ్లు ఏర్పాటు చేసి కనీసం వాటర్ కనెక్షన్ ఇవ్వలేదు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఇంటి యజమాని గత కొన్ని రోజుల నుంచి ఇవ్వాల రేపు అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు తప్పా పనులు చేయించడం లేదు. కనీసం మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది. అయినా పట్టించుకోవడం లేదు. వేరే భవనంలోకి మార్చాలని ప్రయత్నం చేస్తున్నాం.

– దాసు, ప్రిన్సిపాల్



అధ్వానంగా ఉన్న మరుగు దొడ్లు

మహిళలకు కట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

సైదాబాద్, సెప్టెంబర్ 3: చావునీ డివిజన్ పరిధిలోని గుడ్డిబౌలి కమ్యూనిటీ హాల్‌లో ఉచిత టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 50 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా సాలార్ సెలై ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుట్టు శిక్షణలో నైపుణ్యం పొందిన మహిళలు ఆర్థికంగా స్వయం శక్తితో రాణించడం కోసం వారికి కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. టైలరింగ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు ఇవ్వటమే కాకుండా వారికి వర్క్ ఆర్డర్లను కూడా ఇప్పించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ ఎం. ఎ. సలాం షాహిద్, ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

కందుకూరు, సెప్టెంబర్ 3: ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని.. వారికి నెలకు రూ.26వేల వేతనం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం జిల్లా నాయకులు సరస్వతి, లక్ష్మీదేవి, వెంకటమ్మ, బాగ్యలక్ష్మి, జయసుద, శ్రీలక్ష్మి, ముంతాజ్ బేగం, అశ్విని, కవిత, సుశీల, రాధిక పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కందుకూరు, సెప్టెంబర్ 3: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు మంద జ్యోతి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం నాయకులు మంద పాండు మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎంపీ ఈటల

చంపాపేట, సెప్టెంబర్ 3: ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. చంపాపేట డివిజన్ పరిధి కుమ్మరిబస్తీలో రూ.56లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం బీజేపీ రంగ్గారెడి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగ్గారెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిలివేర్ అనిల్‌కుమార్, బీజేపీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీశైలం, గాజుల శేఖర్, రాంపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు డ్రైనేజీ ఇబ్బందులను తొలగించాలి

సైదాబాద్, సెప్టెంబర్ 3: మురుగునీటి సమస్య పరిష్కరించేందుకు జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణారవీందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ బోర్డుకాలనీ, ఏపీఏయూ కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్యామ్‌సుందర్ నాయక్, ఆస్మాన్‌ఘడ్ జలమండలి డీజీఎం నాగరాజు, సైదాబాద్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి పుల్లూరి ఆర్థిక సహాయం

సైదాబాద్, సెప్టెంబర్ 3 : దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్ టీ కాలనీకి చెందిన కరాటే మాస్టర్ తీగల శ్రీనివాస్ కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ పుల్లూరి ఉపేందర్ గుప్తా, లయన్స్ క్లబ్ సభ్యులు మురళీ కృష్ణ రూ.20వేల ఆర్థిక సహాయం చేశారు.

శివారు అభివృద్ధికి సహకరించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరిన లచ్చిరెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబర్ 3: నగర శివారులో ఉన్న బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎన్‌రెడ్డినగర్‌లో చాలా కొత్త కాలనీలు ఏర్పడ్డాయని.. ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని సూచించారు. భారీ వర్షాలతో రహదారులు దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరించాలని సూచించారు. కొన్ని చోట్ల కొత్త రహదారులు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రతిపాదనలు ఆమోదించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యలు తీర్చండి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 3: కొత్తపేట డివిజన్‌లోని తాగునీటి సమస్యలు పరిష్కారం చేయాలని జలమండలి జీఎం బలరామకృష్ణరాజుకు కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్-1లో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని, డివిజన్‌లోని వివిధ కాలనీల్లో మంచి నీటి పైపులైన్‌ను పొడిగించాలని కోరారు.

అడ్డగోలుగా తవ్వారు.. అడ్డంగా వదిలేశారు

వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు మ్యాన్‌హోళ్ల నిర్మాణం కోసం తవ్విన గుంతలు

కార్యాలయం ముందు మట్టి కుప్పలు, గుంతలు ఉండటడంతో జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్ దృశ్యం

● రిజిస్ట్రేషన్ ఆఫీస్ ముందు గుంతలు, మట్టికుప్పలు ● అవస్థలు పడుతున్న ప్రజలు

వనస్థలిపురం, సెప్టెంబర్ 3: జాతీయ రహదారి విస్తరణ, డ్రైనేజీ మరమ్మతుల్లో భాగంగా అడ్డగోలుగా తవ్వకాలు జరిపిన అధికారులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇది జాతీయ రహదారి పక్కనే ఉన్న వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ముందు పరిస్థితి. నిత్యం వందలాదిగా ఆ కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. ఆఫీస్ ఉన్న కాంప్లెక్స్‌లోనే పలు ప్రైవేట్ వాణిజ్య కార్యాలయాలు కూడా ఉన్నాయి. అక్కడికి వచ్చేవారికి అడ్డుగా ఉన్న మట్టి కుప్పలు, గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదు.

20రోజులైనా పట్టించుకోవడం లేదు...

జాతీయ రహదారి పనుల్లో భాగంగా డ్రైన్ నిర్మిస్తున్నారు. అక్కడ తవ్విన మట్టిని కాంప్లెక్స్ ముందు కుప్పలుగా పోశారు. దానికి తోడు కాంప్లెక్స్ ముందు భాగంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మించేందుకు పెద్ద గుంతలు తీశారు. కానీ 20రోజులైనా వాటిని పూడ్చలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ ప్రాంతమంతా బురదమయం కాగా, పెద్ద గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదకరంగా మారాయి. అటు హైవే అథారిటీ అధికారులు గానీ, జీహెచ్‌ఎంసీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమగ్ర కుల గణన చేయాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బక్తుల సిద్ధేశ్వర్‌ను బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాం నేత మంగళవారం కలిశారు. ఆయన దీక్షకు మద్ధతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చకుంటూ తిరగబడతామని హెచ్చరించారు. – వనస్థలిపురం, సెప్టెంబర్ 3

ఎంబీఏ వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం తరువాత ఎంబీఏలో చేరిన వారు తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సులన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 14వ తేదీ వరకు చెల్లించవచ్చని అన్నారు. ఈ పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చు.

ఎంఎంఎస్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్) పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంఎస్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని అన్నారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) (నాన్ సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) (సీబీసీఎస్) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

దెబ్బడగూడ వివేకానంద యూత్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. యువజన సంఘం ఏర్పడి 40 సంవత్సరాలు కావడంతో అలనాటి యూత్ అధ్యక్షులతో పాటు సభ్యులందరూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు కల్లెం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ అధ్యక్షుడు అమ్రాబాద్ కృష్ణతో పాటు సభ్యులను సన్మానించారు. – కందుకూరు, సెప్టెంబర్ 3

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

సైదాబాద్, సెప్టెంబర్ 3: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ జంట పండుగలను ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని సౌత్-ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. మంగళవారం సాయంత్రం చంపాపేట మినర్వా గార్డెన్‌లో జరిగిన సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోని పది పోలీస్ స్టేషన్ల పోలీసు, పీస్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పీస్ కమిటీ సభ్యులు నవరాత్రి ఉత్సవాలు ముగిసేంత వరకు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ స్వామి, సైదాబాద్, సంతోష్‌నగర్, మలక్‌పేట, చంద్రాయణగుట్ట ఏసీపీలు, పది పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, పీస్ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం

చంపాపేట, సెప్టెంబర్ 3: ప్రతి అమావాస్య రోజు శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేయడం అభినందనీయమని పోలీస్ రిటైర్డ్ అధికారి కొండపి వెంకటేశ్వరరావు అన్నారు. చంపాపేట నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయ సమీపంలోని చౌకధరల రేషన్ షాపు ముందు శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ చైర్మన్ భగవాజీ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా సుమారు 600 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ భగవాన్‌జీ, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్య ఔషధాలపై పరిశోధనలు జరగాలి

సైదాబాద్, సెప్టెంబర్ 3: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్)లో రెండు రోజులపాటు జరిగే సంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధిపై జాతీయ సెమినార్‌ను మంగళవారం సీఎస్ఐఆర్-ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెసీ బోస్ నేషనల్ ఫెలో, డిస్టింగ్విష్డ్ సైంటిస్ (అయుష్ మంత్రిత్వ శాఖ) డాక్టర్ మధు దీక్షిత్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంప్రదాయ వైద్య వ్యవస్థల్లో కొత్త ఔషధాలను అభివృద్ధి చేయటంలో తాజా పురోగతి, భవిష్యత్ ప్రమాణాళికలను చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రముఖ పరిశోధకులను, అయుర్వేద వైద్యులను, శాస్త్రవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. శాస్త్రవేత్తలు వినూత్న పరిశోధన పద్ధతులు, సంప్రదాయ, అధునిక పద్ధతులను సమన్వయంతోపాటు నియంత్రణ సవాళ్లను పరిష్కరాల గురించి క్షుణంగా చర్చించాల్సిన అవశ్యకతను వివరించారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్(న్యూఢిల్లీ) ప్రొఫెసర్ వైద్య రబీనారాయణ ఆచార్య మార్గదర్శకత్వంలో నిర్వహించే జాతీయ సదస్సులో ఇమామి లిమిడెడ్ ఆర్‌అండ్‌డీ హెల్త్‌కేర్ అడ్వైయిజర్ డాక్టర్ చంద్రకాంత్ కటియార్, మాజీ డ్రగ్ కంట్రోల్ (ఇండియా) డాక్టర్ సుదీప్తా డే హాజరయ్యారు. వీరితోపాటు 11మంది శాస్త్రవేత్తలు అతిథిగా పాల్గొని దేశవ్యాప్తంగా సంప్రదాయ వైద్య ఔషధాలపై చేస్తున్న పరిశోధనల గురించి వివరించారు. అదే విధంగా ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన ఔషధ, వృక్షశాస్త్రాలకు చెందిన నిపుణులు పాల్గొని తమ పరిశోధనలను వివరించారు. సదస్సుకు హాజరుకాని అనేక మంది శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ ఇన్‌చార్జి డైరెక్టర్ జి.పీ. ప్రసాద్, సీసీఆర్ఏఎస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎస్ఐఆర్-ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మధు దీక్షిత్ తదితరులు